
# అనగనగా ఒక రోజు

కలపర్తి సత్యం



రాత్రి పన్నెండు గంటలు దాటింది.

ఆ వృద్ధుల ఆశ్రమంలో ఒకే ఒక గదిలోని దంపతులు తప్ప అంతా నిద్రపోయారు.

"పన్నెండు దాటింది, ఇక నిద్రపొండి!" చెప్పింది ఆండాళ్.

"నిద్ర రావడం లేదు. నా కొడుకు చేసిన పనికి!" గొంతులో బాధ వినిపిస్తుండగా చెప్పాడు గోవిందం.

"అన్నీ మరచిపోయి హాయిగా పడుకోండి. ఏ దెలా జరగాలని ఉంటే అదలా జరుగుతుంది."

ఆండాళ్‌కు ఆ రాత్రంతా నిద్ర లేదు. తెల్లవారుఝామున ఎప్పుడో కాస్త కునుకు పట్టింది. మళ్లీ మెళకువ వచ్చేసరికి భళ్లున తెల్లారింది.
ఆమె ఉలిక్కిపడి లేచి ఆందోళనగా భర్త మంచంవైపు చూసింది.
ఆయనింకా నిద్రలోనే ఉన్నాడు.
లేచి వెళ్లి "ఏమండీ!" అంటూ తట్టి లేపబోయింది.

"ఎలా మరచిపోగలను? వాడు పుట్టినప్పుడు ఊరంతా స్వీట్లు పంచిపెట్టాను. వాడు నడిస్తే ఎక్కడ కందిపోతాడో నని నేలమీద నా చేతులమీద నడిపించాను. వాడు నా గుండెలమీద కెక్కి ఎగిరెగిరి తొక్కుతూ ఆడుకుంటుంటే బాధను దిగమింగుకుంటూ వాడి సంతోషాన్ని పంచుకున్నాను. వాడు బోర్లా పడ్డా, పాకినా, నడిచినా, మాట్లాడినా ఊరంతా పండుగ చేసేవాణ్ణి. అలాంటిది ... నేను వాడికేం ద్రోహం చేశానని మనల్నీ వృద్ధుల అనాథాశ్రమంలో వదలి వెళ్లాడు? వాడి జీవితానికి, వాడి స్వేచ్ఛకు మనమేమి భంగం కలిగించామని ఇలా చేశాడు?" కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా అన్నాడు.

"అవన్నీ ఇప్పుడెందుకండీ? ముందు మీరు ప్రశాంతంగా పడుకోండి. ఆరోగ్యం పాడవుతుంది!" లాలనగా చెప్పిందామె.

"నిద్ర రావడంలేదే! గుండె ఆవేశంతో మండిపోతోంది. నే నెన్ని ఆశలు పెట్టుకున్నాను. ఒక్కగా నొక్క కొడుకు ... వాడి చేతులమీదుగా పోవాలనుకున్నాను. ఆ కొడుక్కి ఇంకో కొడుకు పుడితే ఆ మనవడితో ఈ చివరి జీవితమంతా ఆనందంగా గడపాలనుకున్నాను. రోజురోజుకూ నా కళ్లముందు ఉద్యోగంలో ఎదుగుతూ నాకు పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చేలా వాడు గొప్పగా ఎదుగుతుంటే సంతోషించాలనుకున్నాను. కానీ వాడేం చేశాడు ... రాత్రి రాత్రి 'నాన్నా! నిన్ను, అమ్మను వృద్ధుల ఆశ్రమంలో ఉంచాలనుకుంటున్నాను!' అన్నప్పుడు నా గుండె ఎందుకు ఆగిపోలేదా అనిపించింది!"

"ష్.....! ఊరుకోండి, ఏమిటా మాటలు? మీరు విశ్రాంతి తీసుకోవాల్సిన వయసిది! అనవసరమైన టెన్షన్స్ పెట్టుకోకుండా పడుకోండి."

"నీకు తెలియదు, ఆండాళ్లూ! వాడు మన దగ్గరుంటే, మన గారాబం వల్ల ఎక్కడ పాడైపోతాడోనని చిన్నప్పటినుంచీ రెసిడెన్షియల్ స్కూల్లో, ఆ తర్వాత హాస్టల్లో ఉంచి చదివించాను. నా ఊహ తప్పుకాలేదు. వాడికి ప్రతీ క్లాస్‌లోనూ ఫస్ట్ మార్కులే! వాడలా ఫస్ట్‌క్లాసులు తెచ్చుకుంటూంటే నేను హిమాలయాలు ఎక్కినంత ఆనందపడేవాణ్ణి! వాడలా చదువుతూ 'నాన్నా! నే నొక అమ్మాయిని ప్రేమించాను!' అంటే ఆనందంగా, వివరాలేమీ అడగకుండా వాడికిష్టమైన అమ్మాయితో పెళ్లి జరిపించాను.



ఈ చివరి వయసులో వాడి దగ్గర ఉండాలని, ప్రతిరోజూ ఉదయం కోడలి చేతులమీదుగా కాఫీ తాగాలని, వాడు నా ఆరోగ్యం కోసం మందులు తీసుకువస్తూ డాక్టర్‌కి చూపిస్తూ టెన్షన్ పడుతుంటే వాడికి నా మీద ఉన్న ప్రేమకు నేను పొంగిపోవాలని ఎన్ని కలలు .... ఎన్ని ఆశలు ...! అవన్నీ నిరాశలైపోయాయి. కలలన్నీ కల్లలైపోయాయి. నేను వాడికేం ద్రోహం చేశాను? నేనేం పాపం చేశాను?" చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడుస్తూ అడిగాడు గోవిందం.

ఆమె లేచి అతని దగ్గరకు వచ్చి గుండెల కదుముకుని సముదాయించసాగింది. అలా మాట్లాడుతూనే గోవిందం నిద్రలోకి జారిపోయాడు. నిద్రలో కలవరింతలు ...

"ఒరే రవిచంద్రా! నన్ను అనాథను చెయ్యకురా! నీతో కలిసి ఉండనీయరా ... నాకు నిన్ను, కోడల్ని, మనవడ్ని చూడాలని ఉందిరా..... నీతో కలిసి ఉండాలని ఉందిరా ... ఒరే రవిచంద్రా! నీ చేతుల్లో చచ్చిపోవాలని ఉందిరా.... నన్ను ఒంటరివాడ్ని చేయకురా!" అంటూ కొడుకుని ఉద్దేశించి మాట్లాడుతూనే ఉన్నాడు.


ఆండాళ్‌కు ఆ రాత్రంతా నిద్ర లేదు. తెల్లవారుఝామున ఎప్పుడో కాస్త కునుకు పట్టింది. మళ్లీ మెళకువ వచ్చేసరికి భళ్లున తెల్లారింది.

ఆమె ఉలిక్కిపడి లేచి ఆందోళనగా భర్త మంచంవైపు చూసింది. ఆయనింకా నిద్రలోనే ఉన్నాడు.

లేచి వెళ్లి "ఏమండీ!" అంటూ తట్టి లేపబోయింది. ఒళ్లంతా వేడిగా ఉంది. బహుశా కొడుకు మీద ప్రేమ వల్ల జ్వరం వచ్చి ఉంటుంది. ఆ సమయంలో ఆమెకు కొడుకుమీద అసహ్యం కలిగింది.

"ఏమండీ...!" అంటూ తట్టి లేపిందతన్ని.

అతను లేస్తూనే చుట్టూ చూసి, తాను అనాథాశ్రమంలో ఉన్నానని గుర్తొచ్చి, "ఏమే ...



అబ్బాయి రాలేదా? వాణ్ణి చూడకుండా నేను ఉండలేనే. మనం వాడి దగ్గరకు వెళ్దామే..." అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

ఆమె ఏదో అనబోయింది.

అంతలోనే "అలాగే, నాన్నా! మీరు మాతోనే కలిసి ఉందురుగాని!" అన్న మాటలు వినిపించి ఆశ్చర్యంగా అటువైపు చూశారు.

గుమ్మంలో కొడుకు, కోడలు, మనవడు! ఆ వృద్ధ దంపతుల ఆశ్చర్యానికి, సంతోషానికి అంతు లేదు.

"బాబూ, చంద్రా!" ఆనందంగా రెండు చేతులు జాచాడు గోవిందం.

"నాన్నా!" అంటూ తండ్రిని కౌగలించుకున్నాడు రవిచంద్ర.

తల్లి ఆనందంగా వాళ్లిద్దరినీ చూస్తోంది.

"నాన్నా! మీ కీ విషయం తెలుసా? రాత్రంతా మేము ఈ పక్క గదిలోనే ఉన్నాం. మీ సంభాషణంతా విన్నాం!" చెప్పాడు రవిచంద్ర.

వింటున్న గోవిందం, ఆండాళ్లూ ఆశ్చర్యంగా "ఈ గదిలోనే ఏందుకూ?" ఒకేసారి ప్రశ్నించారు.

"మీకు జ్ఞానోదయం కలిగిందీ, లేనిదీ తెలుసుకోవాలని. చిన్నప్పుడు నేను మీ వల్ల పడ్డ మానసిక వేదన, బాధ మీరు అనుభవించారో లేదో ... ఆ బాధ మీకు ఎలాంటిదో తెలియచేయాలనే ఒక్కరోజు మిమ్మల్ని ఈ ఆశ్రమంలో ఉంచాను. అంతేకానీ శాశ్వతంగా మిమ్మల్ని ఇక్కడ ఉంచే ఆలోచన నాకు లేదు."

"మా వల్ల నువ్వు మానసిక వేదన అనుభవించావా? బాధ కలిగిందా? ఏమిటి బాబూ అది?" మళ్లీ గోవిందం, ఆండాళ్లూ ఇద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

"ఈ ముసలి వయసులో మీ రెలా నా దగ్గర ఉండాలనుకున్నారో, నా చిన్నతనంలో నేనూ మీ దగ్గర అలాగే ఉండాలనుకునేవాణ్ణి. కానీ మీ రిద్దరూ ఉద్యోగస్తులవడంవల్ల మీ సంపాదనకు నేను అడ్డుకావడం వల్ల నన్ను మీ రిద్దరూ రెసిడెన్షియల్ స్కూల్, ఆ తర్వాత హాస్టల్లో ఉంచారు. కానీ నే నక్కడ ఎంత మానసికంగా నలిగిపోయేవాణ్ణో మీకు తెలియదు. నేను చదివే స్కూల్లో మధ్యాహ్నం లంచ్ బెల్ మోగగానే నా ఫ్రెండ్ వాళ్ల అమ్మ వచ్చేది. తన కొడుక్కి దగ్గరుండి కొసరి కొసరి గోరుముద్దలు తినిపించేది. వాడు తినకుండా మారాం చేస్తే బుజ్జగించి తినిపించేది. ఆ దృశ్యం నా కళ్లపడ్డప్పుడల్లా మీరంటే తెలియని ద్వేషం, అసహ్యం ఏర్పడేవి నాలో. ఓ రోజు స్కూలు అయ్యాక నా ఫ్రెండ్ వాళ్లింటికి తీసుకెళ్లాడు.

"మే మిద్దరం అంత దూరాన ఉండగానే వాళ్లమ్మ పరుగుపరుగున వచ్చి వాడు మోసే బాగ్ తను తీసుకుని వాడి చేతిలోని టిఫిన్ బాక్స్ కూడా తీసుకుని వాడ్ని ఎత్తుకుని ముద్దాడుతూ వాడికి పట్టిన చెమటను తన పమిట చెంగుతో తడుస్తూ ఇంట్లోకి తీసుకువెళ్లింది. ఆ తర్వాత వాడికి తనే స్వయంగా కాళ్లూ చేతులూ కడిగి వాడికి రవ్వలడ్డూ, కారప్పూస కొసరి కొసరి తినిపించింది. తినిపిస్తున్నంతసేపూ వాడిని ముద్దాడుతూనో, లేకపోతే వాడి క్రాఫ్ సవరిస్తూనో, నడచి రావడం వల్ల వాడి కాళ్లు ఎక్కడ నొప్పి పుట్టాయోనని కాళ్లు పిసుకుతూ లాలనగా, ప్రేమగా చూసింది.

"అలాంటి దృశ్యాలు నే నెన్నోసార్లు చూశాను. ఆ రాత్రంతా నాకు నిద్రపట్టేది కాదు. నాకు వాళ్లందరిలాగే మీదగ్గరుండాలనిపించేది. బెంగగా ఉండేది. రాత్రిళ్లు నిద్రపోకుండా ఏడ్చేవాడిని. ఒక్కోసారి జ్వరం వచ్చేది. అమ్మ ఒడిలో, అమ్మ పక్కన వెచ్చగా పడుకోవాల్సిన నేను ... ఒంటరిగా పడుకునేవాడిని. అమ్మ చేతి గోరుముద్దలు తినాల్సిన నేను ఆయా చేసిన పురుగుల అన్నం తినేవాడిని. నాన్న చేయి పట్టుకుని ప్రపంచాన్ని చూడాల్సిన నేను ఒంటరిగా ప్రపంచాన్ని చూశాను. ఇంటికి వచ్చిన ప్రతిసారీ నేను మీ దగ్గరే ఉంటానని పేచీ పెట్టేవాడిని. ఏడ్చేవాడిని. మీరు బలిమాలీ, భయపెట్టీ మళ్లీ నన్నా నరకకూపంలోకి తోసేసేవారు.

"ఆ బాధ, ఆ ఒంటరితనం పగవారికి కూడా వద్దనిపించేది. పిల్లలకు కావాల్సింది తల్లిదండ్రులిచ్చే డబ్బు, ఆస్తిపాస్తులు కావు, నాన్నా! కాస్తంత ప్రేమ, అనురాగం ... చిన్న చిన్న సరదాలు, సంతోషాలు, వెన్నుతట్టి ధైర్యం చెప్పి ప్రోత్సహించే తల్లిదండ్రులు కావాలి. అమ్మ ఆప్యాయత, అనురాగం, ప్రేమ కావాలి. చేయి పట్టుకుని ప్రపంచాన్ని చూపి విజ్ఞానాన్ని అందించే తండ్రి కావాలి. ఒకోసారి నాకు ఊహ వచ్చాక అనుకునేవాడిని. మీ రిద్దరూ ఉద్యోగస్తులు కాబట్టి మీకు తీరిక ఉండేది కొద్ది గంటలే కాబట్టి మీ పర్సనల్ లైఫ్‌కి అడ్డనుకుని నన్ను ఆ హాస్టల్‌లో ఉంచారేమోనని. అందుకే నేను పడ్డ వేదన, బాధ మీ కర్థమయ్యేలా చెప్పాలని ... కనీసం మీరు ఒకరోజైనా ఆ బాధ అనుభవించాలనే నేను మిమ్మల్ని ఈ ఆశ్రమంలో వదిలేస్తున్నట్లు నాటకం ఆడాను, నన్ను క్షమించండి!" అంటూ తలవంచుకున్నాడు రవిచంద్ర.

"నిజమే, చంద్రా! మేము చేసింది తప్పే! పిల్లలకు ఏం కావాలో, వాళ్లనెలా పెంచాలో చక్కగా చెప్పావు. ఈ ఒక్క రోజులో మళ్లీ మరిచిపోలేని ఓ తియ్యని గుణపాఠం చెప్పావు. మళ్లీ జన్మంటూ ఉంటే నీ తండ్రిగా పుట్టి, నువ్వు కోరిన రీతిలో నిన్ను పెంచుతాను!" రవిచంద్రను కౌగలించుకుంటూ చెప్పాడు గోవిందం. ■

